Digital, tmedia.net.in
# టీ-మీడియా
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 100
సంచిక : 222
పేజీలు : 3
శుక్రవారం, ఏప్రిల్ 24, 2026
GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

## ఐటీసీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

### -జేఏసీ కన్వీనర్ సానికొమ్ము శంకర్‌రెడ్డి



**టి మీడియా, ఏప్రిల్ 23, బూర్గంపహాడ్ :** ఐటీసీ యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడి అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, వేతన ఒప్పంద పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక జేఏసీ కన్వీనర్, బీఆర్టీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐటీసీ కర్మాగారంలో అడ్మిన్ బ్లాక్ వద్ద కార్మికులు మూతికి నల్ల మాస్కులు ధరించి పెద్ద ఎత్తున మౌన ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ వేతన ఒప్పంద పెండింగ్ సమస్యలు అలాగే ఉన్నాయని, 14వ వేతన ఒప్పందంలో జాప్యం జరుగుతుందని దీనికి ఐటీసీ యాజమాన్యం, గుర్తింపు మిగతా 3లో

# అక్రమంగా మట్టి తరలింపు

- **జేసీబీ తో సహా 8ట్రాక్టర్లు సీజ్**



**టి మీడియా, ఏప్రిల్ 23, కూసుమంచి:** కూసుమంచి మండలంలో మట్టిమాఫీయా జోరుగా సాగుతోంది.. రెవెన్యూ, పోలీసులు, అధికారులు అనేక దఫాలుగా హెచ్చరించినప్పటికి మట్టి అక్రమ తరలింపు మూడుపువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.. రాజకీయాలను అడ్డుగా పెట్టుకుని ఇష్టానుసారంగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లతో చెరువులో మట్టిని(మర్ర)ను తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. అయితే గత కొద్ది రోజులుగా మండలంలో మట్టి అక్రమ రవాణాపై మీడియాలో వరస కథనాలు రావడంతో జిల్లా కలెక్టర్ అనుదీఫ్ దురిశెట్టి స్పందించి గత రెండు రోజుల ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్.. అక్రమంగా మట్టి తరలింపు జరిపితే ఊరుకునేది లేదని సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.. రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులకు క్లీయర్ ఇంటికేషన్ ఇచ్చారు.. అయ్యినప్పటికి మట్టి అక్రమ రవాణా అగడం లేదు.. ప్రకటన విడుదల చేసి రెండు రోజుల్లోనే చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలించేందుకు కొందరు వ్యక్తులు రాజకీయాలను అడ్డుగా పెట్టుకుని వ్యాపారం సాగిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మట్టి అక్రమ రవాణా జోరుగా జరుగుతోంది.. ముఖ్యంగా గుర్వాయిగూడెం గ్రామంలోని స్థానిక చెరువులో కొందరు వ్యక్తులు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. గత మూడు రోజులుగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పట్టపగలు జేసీబీ, ట్రాక్టర్ల తో మట్టిని అక్రమంగా దూరప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రతి రోజు వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని వ్యాపార ప్రాంగణాలకు తరలిస్తూ భారీగా సంపాధిస్తున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆధాయానికి గండికొడుతున్నారు. ఇదేంటని ఎవరైన ప్రశ్నిస్తే ఓ పార్టీ నాయకులం, మా బండ్లనే ఆపుతారా..? అని కొందరు, మేము మంత్రి మనుషులని కొందరు అధికారులను బెదిరిస్తూ మట్టిని అక్రమంగా తరిలిస్తున్నట్లు తెలిసింది. అక్రమ రవాణాకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కానీ, ఆయన మనుషులు సపోర్టు చేయరు. అలాంటి విషయంలో చర్యలు తీసుకోవాలనే చెబుతుంటారు..? అనేక సార్లు వేదికల పై కూడా మంత్రి, వారి అనుచరులు సైతం ఇదే చెప్పారు. అక్రమాలు చేస్తే ఊరుకునేది లేదని చెప్పినప్పటికి కొందరు మంత్రి పేరుతో తప్పుడు పనులు చేస్తున్నారనే ప్రచారం ఉంది.. మండలంలోని గుర్వాయిగూడెం చెరువులో బుధవారం అక్రమంగా మట్టిని తరలిస్తుండగా సమాచారం అందుకున్న కూసుమంచి రెవెన్యూ అధికారులు తహసీల్దార్ సైదులు, ఆర్ఐ రాము, సర్వేయర్ వెంకట్, జీపీవో, సిబ్బంది చెరువు వద్దకు వచ్చి మట్టిని తవ్వుతున్న జేసీబీని, తరలిస్తున్న 8ట్రాక్టర్లను సీజ్ చేశారు. వాటిని తనిఖీ చేసి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కూసుమంచి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. జేసీబీ, 8ట్రాక్టర్ల పై రెవెన్యూ అధికారులు, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ట్రాక్టర్లు, జేసీబీ కూసుమంచి మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందినవిగా పోలీసులు గుర్తించారు.

**కఠిన చర్యలు : సైదులు, తహసీల్దార్**

కూసుమంచి మండలంలోని ఏ గ్రామంలోనైనా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, తరలింపు జరిగినా, మైనింగ్ కు సంబంధించిన పనులు చేసిన అట్టి వాటిపై ఫిర్యాదు అందగానే తక్షణమే తనిఖీ చేసి వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు. కలెక్టర్ అనుదీఫ్ ఇప్పటికే పూర్తి స్థాయి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. అనుమతులు లేకుండా మైనింగ్, మట్టి విక్రయాలు చేసిన, తరలించిన కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సూచించారు.

# విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

- **ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరేలా సదుపాయాలు**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



**టీ మీడియా, ఏప్రిల్ 23 , మణుగూరు :**మండలం లంక మల్లారం గ్రామంలో గురువారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేసి, టీటీఆర్‌జేసీ బాలికల డార్మెటరీ హాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకటరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమానికి ముందుగా రూ.1 కోటి అంచనా వ్యయంతో ప్రధాన బీటీ రహదారి నుండి పాఠశాల వరకు అప్రోచ్ బీటీ రహదారి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇటీవలే రూ.2 కోట్లు 70 లక్షల వ్యయంతో బాలికల వసతి గృహాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. పేదవారి పిల్లలు కూడా ధనికుల పిల్లలతో సమానంగా చదువుకోవాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వ పాఠశాలలు మరియు రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. విద్య పట్ల ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు అనేక నిదర్శనాలు ఉన్నాయని వివరించారు.పేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా మంచి ఆహారం తీసుకుంటూ, మెరుగైన విద్యను అభ్యసించాలనే ఆశయంతో ప్రభుత్వం హాస్టళ్లలో ఉన్న బాలబాలికలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తోందన్నారు. ఇంటి వద్ద తల్లులు చేసే వంటల రుచిని గుర్తు చేసేలా పోషకాహారంతో కూడిన మెనూను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ అందించే ఆహారం విషయమై స్పష్టమైన ప్రణాళికతో హాస్టళ్లలో సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.ఈ ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుపై పూర్తి విశ్వాసంతో ఉందని, వారు తమ కాళ్ల మీద నిలబడి దేశాన్ని, ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగగలరని నమ్ముతున్నామని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎవరికీ చదువు ఆగిపోకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. పేదవారి పిల్లలు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను పొందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.65 కోట్ల వ్యయంతో ఏ టీ సి కేంద్రాల మిగతా 3లో





## పోషణ పక్వాడా సందర్భంగా పోషణ మేళా

### తల్లులకు అవగాహన సదస్సు.

**టీ మీడియా, ఏప్రిల్ 23 ,కొణిజర్ల :**పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా తనికెళ్ల అంగన్వాడి సెంటర్లో పోషణ మేళాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.సీ.సీ.ఈ (ప్రారంభ శిశు సంరక్షణ, విద్య) కార్యకలాపాలు, 'స్క్రీన్ లేకుండా గడిపే సమయం', కుటుంబంతో కలిసి ఆటలు ఆడే సమయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి ఆటలు, యోగా ఎంతో అవసరమని ప్రోత్సహించారు.సెక్టార్ సూపర్వైజర్ డి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, పోషకాహారంలో ఆకుకూరలు, కూరగాయలు, ధాన్యాలు, పప్పులు తప్పనిసరిగా ఉండాలని, సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని తల్లులకు వివరించారు.హెచ్.ఎం. శైలజ మాట్లాడుతూ, పిల్లలలో సర్వతోముఖ అభివృద్ధి కోసం ఆటలు ఆడించడం, పుస్తకాలు చదివించడం, సృజనాత్మక కార్యక్రమాలు చేయించడం అవసరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రేణుక, జ్యోతి, అంగన్వాడీ టీచర్లు ఝాన్సీ, కళావతి, పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ద్వితీయ ర్యాంక్ సాధించిన శివరాం సన్మానం.

**టీ మీడియా ,ఏప్రిల్ 23 ,కొణిజర్ల :**ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్ సాధించిన తీర్థం శివరాం ను తుమ్మలపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థలదాత కట్ల చంద్రశేఖర్ బాబు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా సన్మానించారు.మారుమూల గ్రామమైన తుమ్మలపల్లికి చెందిన శివరాం, ఏన్కూర్లోని ప్రభుత్వ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి ఈ ప్రతిష్టాత్మక విజయాన్ని సాధించాడు. అతని ప్రతిభను కొనియాడుతూ మాజీ సర్పంచ్ కట్ల సత్యం, పుష్పావతి శివరాం నీ సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అజితతో పాటు ఉపాధ్యాయులు కొండబోలు రమేష్, గుంటి రమేష్, సత్యనారాయణ, హరీష్, హనుమంతరావు, పద్మ, పుల్లారావు మరియు గ్రామస్థులు పాల్గొని శివరాం ను అభినందించారు.ఈ సందర్భంగా కట్ల చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ, 6వ తరగతి నుండి ప్రతి తరగతిలో టాప్ ర్యాంక్ సాధించే విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. అలాగే తుమ్మలపల్లి గ్రామం నుండి 10వ తరగతి, ఇంటర్, టీఈఈ, ఈఏపీసెట్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు.



## పోయిన ఫోన్లు తిరిగి అందజేసిన ముదిగొండ పోలీసులు

**టీ మీడియా, ఏప్రిల్ 23, ముదిగొండ**

మండల కేంద్రానికి వివిధ ప్రాంతాల నుండి పనులకోసం వచ్చిన (1) శివరాత్రి రామయ్య, ముదిగొండ (2) పిప్పలల కృష్ణ, ముదిగొండ, (3) రాజపుత్ర సాయి, నేలకొండపల్లి, (4) ఆలకుంట నవీన్, ముదిగొండ అనువారు సెల్ ఫోన్ లను పోగొట్టుకున్నారని పిర్యాదుపై, వారిచ్చిన పిర్యాదును జక్ష్మీజుక్ష్మ పోర్టల్ నందు నమోదు చేసి, దాని ద్వారా పొగట్టుకున్న సెల్ ఫోన్ లను రికవరీ చేసి, సుమారు రూ,, 71,000/- ల విలువగల (04) మొబైల్ ఫోన్ లను ఈరోజు ముదిగొండ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ. ఉ. మురళీ బాధితులకు అందచేసినారు.

# హైకోర్ట్ తీర్పుపై బిఆర్ఎస్ సంబరాలు

### -కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా

**టీ మీడియా, ఏప్రిల్ 23 ,అశ్వరావుపేట:** కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషనపై హైకోర్ట్ తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బి ఆర్ ఎస్ నాయకులు దమ్మపేటలో సంబరాలు జరుపుకున్నారు. అలాగే నేడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. నియోజకవర్గ ప్రజల తరుపున వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ.రైతుల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం...రాబందుల్లా రాష్ట్రాన్ని దోచుకోవడమే రేవంత్ అండ్ టీమ్ లక్ష్యం. హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ కుట్రలు బట్టబయలు అయ్యాయి.అధర్మంపై..ధర్మం విజయం సాధించింది.కేసీఆర్ నిజాయితీకి,తెలంగాణ రైతుల నమ్మకానికి,ప్రాజెక్ట్ కోసం కష్టపడ్డ ఇంజినీర్ల శ్రమకు దక్కిన గౌరవం.ప్రజల దృష్టిని మళ్ళించడానికెనే ఇలా మా నాయకుల మీద బురదజల్లుతున్నారు.రేవంత్ రెడ్డి 420 హామీల అమలు చేయడం పక్కన పెట్టి పొద్దున లేస్తే..కేసీఆర్ ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారం. ఒక ముఖ్యమంత్రికి ఉండాల్సిన లక్షణాల్లో ఏ ఒక్క లక్షణం రేవంత్ లో లేవు.పరిపాలన చేతకాకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలి. తెలంగాణకు కల్పతరువు అయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ను రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంచినందుకు రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి.?రాజ్యాంగం,చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా న్యాయవ్యవస్థ చూస్తూ ఊరుకోదు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాల్సిందే.? మా పూర్తి మద్దతు ఆర్టీసీ కార్మికులకు ఉంటుంది.మరో 2ఏండ్లలో కేసీఆర్ ప్రభుత్వం వస్తుంది.మీ లెక్కలు తప్పక సరిచేస్తాం.? ప్రజలు ఆలోచనలో పడ్డారు.నమ్మించి గొంతుకోసిన కాంగ్రెస్ కి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.?ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొడ్డ



రమేష్,పార్కలగండి సర్పంచ్ కొమరం సుశీల,మాజీ ఉప సర్పంచ్ దారా యుగంధర్ గాజుబోయిన ఏసుబాబు అబ్దుల్ జిన్నా, బుడే నియోజకవర్గ యువజన విభాగ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాస్ రావు,వార్డ్ మెంబర్లు దారా రాము, గోళ్ళ భవనీ కృష్ణ యాదవ్,రూపా రాంబాబు కౌలురి నాగయ్య మండల బి ఆర్ ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు మండవ సత్య కాసిని శ్రీను,మద్దెల పుల్లారావు,వెలుగోటి మహేష్, దండాబత్తుల కాంతారావు శేషాద్రి,ధర్మ,పోలారావు,నరేంద్ర పాల్గొన్నారు.

# స్వీయ జనగణన పై అవగాహన సదస్సు..

**టీ.మీడియా,ఏప్రిల్23,చింతూరు:**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం మరియు యన్ యస్ యస్ ఆధ్వర్యంలో గురువారం స్వీయ జనగణనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రత్న మాణిక్యం ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ జనగణన ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జరుగుతుందని, దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన సమాచారం జనగణనతోనే సాధ్యమవుతుందని ఇందుకోసం డిజిటల్ పరిజ్ఞానం ఉన్న యువత స్వీయ జనగణన నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి జి వెంకటరావు మాట్లాడుతూ స్వీయ జనగణనలో మన వివరాలను మనమే ఆన్లైన్లో నమోదు చేసుకోవడానికి అధికారిక పోర్టల్ ద్వారా ఏప్రిల్ 16, 2026 నుండి ఏప్రిల్ 30 వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని చెప్పారు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఎస్ అప్పనమ్మ మాట్లాడుతూ భారతదేశంలో జనగణన హోమ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడి, దేశాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. కళాశాల కంప్యూటర్ అధ్యాపకుడు ఎన్ ఆనంద్ స్వీయ జనగణన గురించి వివరిస్తూ మొబైల్ నెంబర్ తో లాగిన్ అయ్యి పేరు, వివాహ స్థితి, భాష, ఇంటి అడ్రస్, కుటుంబ సభ్యుల సంఖ్య, హౌసింగ్ వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలని, తర్వాత వచ్చే రిఫరెన్స్ ఐడిని భద్రపరచుకొని ఎన్యూమరేటర్స్ ఇంటికి



వచ్చినప్పుడు ఈ నెంబర్ చూపించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎం శేఖర్, డాక్టర్ వై పద్మ, డాక్టర్ కే శకుంతల, జి హారతి, కే శైలజ, ఎం నాగ మోహన్ రావు, తదితర అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేటింగ్ క్రానికల్ ఆవిష్కరణ.

**టీ మీడియా, ఏప్రిల్ 23 ,కొణిజర్ల :**స్థానిక గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం, గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవం, ఆంగ్ల భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆంగ్ల విభాగాధిపతి కె.పీ. ఐశ్వర్య ఆధ్వర్యంలో "గ్రాడ్యుయేటింగ్ క్రానికల్ -- 2026" అనే పుస్తకాన్ని రూపొందించారు. కళాశాల తుదివత్సర విద్యార్థులు కళాశాలలో గడిపిన అనుభూతులను ఈ పుస్తకంలో సేకరించి ముద్రించారు.ఈ పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కె. రజనీ, వైస్ ప్రిన్సిపాల్ బి. రాజేశ్వరి మరియు ఐక్యూఏసీ సమన్వయకర్త కె.పీ. ఐశ్వర్య ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ కె. రజనీ మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, ఒక మంచి పుస్తకం వందమంది



మిత్రులతో సమానం అని వివరించారు. పఠనం ద్వారా జ్ఞానం, ఆలోచనా విధానం పెరుగుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా, ఇంత మంచి పుస్తకాన్ని కళాశాల గ్రంథాలయానికి అందించినందుకు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. రజనీ, వైస్ ప్రిన్సిపాల్ బి. రాజేశ్వరి, ఐక్యూఏసీ సమన్వయకర్త కె.పీ. ఐశ్వర్య, గ్రంథాలయ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమ్మర్ కోచింగ్ క్లాసుల నిర్వహణ

### -జీఎం శాలెం రాజు

**టీ మీడియా, ఏప్రిల్ 23 , రుద్రంపూర్:** సింగరేణి కొత్తగూడెం ఏరియాలో విద్యార్థుల కోసం సమ్మర్ కోచింగ్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజు తెలిపారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 18 సంవత్సరాల లోపు బాల బాలికలకు



ఈ కోచింగ్ తరగతులు ఏప్రిల్ 27 నుండి మే 21 వరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించబడతాయన్నారు. విద్యార్థులకు ప్రాథమిక అంశాలతో పాటు మెరుగైన మార్గదర్శకత్వం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

**నాలుగు కేంద్రాల్లో తరగతుల నిర్వహణ**

ఫుట్ బాల్, సాధన గ్రౌండ్స్, రామవరంవాలీబాల్, ప్రొ.జయశంకర్ స్టేడియం, గౌతంపూర్అథ్లెటిక్స్, ప్రొ.జయ శంకర్ స్టేడియం, గౌతంపూర్ కిక్ బాక్సింగ్, రెస్క్యూ గ్రౌండ్స్, 3 ఇంక్లయిన్ ప్రాంతాల్లోని గుర్తించిన కేంద్రాల్లో ఈ శిక్షణ కొనసాగనున్నట్లు వెల్లడించారు. ఉదయం 6.00 గంటల నుండి 8.00 గంటల వరకు అలాగే సాయంత్రం 5.00 గంటల నుండి 6.30 గంటల వరకు క్లాసుల నిర్వహణ ఉంటుందన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, సమీప కేంద్రాలలో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమ్మర్ కోచింగ్ ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.



## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య.

**టీ మీడియా ,ఏప్రిల్ 23 ,కూసుమంచి:**చెట్టుకి ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన గురువారం పాలేరులో చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా మోతే మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ పాషా (45) అను వ్యక్తి పాలేరు జలాశయం వద్ద వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జలాశయంలోకి చేపల వేటకు వెళ్ళు మత్స్యకారులు ఈ ఘటనని ఉదయం గమనించారు. ఈ సమాచారం మత్స్యకారులు కూసుమంచి పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## శ్రీ ఆంజనేయ అందర్ని దీవించు

### -మంత్రి. పొంగులేటి వేడుకోలు

**టీ మీడియా,ఏప్రిల్ 23, కూసుమంచి:**శ్రీ అభయ ఆంజనస్వామి ఆశీస్సులతో సమస్త లోకాన్ని చల్లంగా దీవించాలని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వేడుకున్నారు.కూసుమంచి మండలం లింగారం తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి, ధ్వజస్తంభం, నవగ్రహాలు, జంట నాగులు, నాభిశీల, స్థిర విగ్రహ యంత్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు చేసి భక్తులలో ఆధ్యాత్మిక భావన పెంచారు. శ్రీ ఆంజనేయ దీవెనలతో ప్రజల నిత్యం ఆయు, ఆరోగ్య, సిరి సంపదలు, సస్యశ్యామల అభివృద్ధి, శాంతి, సౌభాగ్యాలతో విరజిల్లాలని మంత్రి శ్రీనివాసరెడ్డి దేవుని ఆశీస్సులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎదులాపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ పోకబత్తిని అనిత సర్పంచ్ బానోత్ పుష్ప-మ,రవి కుమార్, తండా పెద్దలు వడిత్య బాలకృష్ణ , వీరన్న స్వామి, స్వాములు,భక్తులు , ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అగ్నిప్రమాదంతో రైతుకు భారీ నష్టం

### సహాయం చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్

**టీ మీడియా,ఏప్రిల్23,సింగరేణి(కారేపల్లి):** కల్లంలో అగ్నిప్రమాదం వల్ల మిర్చి పంట కోల్పోయిన రైతు అజ్మీర శ్రీనివాస్‌ను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు కొండెబోయిన నాగేశ్వరరావు కోరారు.గురువారం సీపీఐ(ఎం) నాయకులు బాధిత రైతు మిర్చి కల్లాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, కౌలుకు తీసుకున్న భూమిలో మిర్చి పంట సాగు చేసిన శ్రీనివాస్ 14 క్వింటాళ్ల మిర్చిని కోసి కల్లంలో ఆరబెట్టగా అగ్నిప్రమాదం జరిగి పూర్తిగా కాలిపోయిందన్నారు. రైతు చేసిన కష్టం మొత్తం అగ్నికి ఆహుతై, సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు.ఈ ఘటనపై రైతు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న గిరిజన రైతు శ్రీనివాస్‌కు సీపీఐ(ఎం) నాయకులు ధైర్యం చెప్పి, హార్టికల్చర్, వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.నష్టపోయిన పంటను తక్షణమే పరిశీలించి, ప్రభుత్వం నుంచి తగిన పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు పండగ కొండయ్య, కల్తి రామచంద్రు, పోతర్ల నాగేశ్వరరావు, కరపాటి సీతారాములు, దారావత్ వస్రాం, కుర్సం శ్రీను, భూక్య రమేష్, అలాగే సోసైటీ డైరెక్టర్ కొత్తూరి రామారావు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె

**టీ మీడియా, ఏప్రిల్ 23 , భద్రాచలం :** భద్రాచలంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. బుధవారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు ఆర్టీసీ ఇన్‌గేటు వద్ద కార్మికులు నిరసన తెలిపేందుకు వేసుకున్న టెంటును తొలగించారు. గురువారం నాడు డిపో ఇన్‌గేటు వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గూడూరు సత్యనారాయణ, భద్రాచలం ఆర్టీసీ జేఏసీ చైర్మన్ బర్ల మణారావు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు సమ్మెను కొనసాగిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో తమ మద్దతు తీసుకుని గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే విషయం మరిచిపోయిందని, గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను సైతం పట్టించుకోవడం లేదన్నారు. అలాగే సిబ్బందిని క్రమంగా తగ్గించేందుకు ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తున్నారని, జిల్లాల్లోని ఆర్టీసీ డిపోలలో సిబ్బందిపై పని ఒత్తిడి పెరగడంతో పాటు అనారోగ్య సమస్యలు పెరుగుతున్నా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నారు.తమ డిమాండ్ల సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఎంతటి త్యాగానికైనా సిద్ధమేనని అన్నారు. గురువారం భద్రాచలం ఆర్టీసీ ప్రాంగణం అంతా ఆంధ్రా బస్సులతో కళకళలాడింది. ప్రయాణీకులు సైతం ఎక్కువగానే కనిపించారు. ప్రయాణీకుల రద్దీని బట్టి మరింతగా బస్సులను పెంచే సూచనలు సైతం కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా భద్రాచలం డిపోకు



చెందిన బస్సులు ఖమ్మం, కొత్తగూడెం, చర్ల మార్గాల్లో 22 అద్దె బస్సులు, 23 ఆర్టీసీ బస్సులను కాంట్రాక్టు డ్రైవర్లతో నడిపారు. అలాగే కొందరు తాత్కాలిక కండక్టర్లను సైతం విధుల్లోకి తీసుకొని వారితో బస్సుల్లో టికెట్లు కొట్టిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కేకే ప్రసాద్, యాకయ్య, ఎం.ఎస్.రావు, జున్ను రవి, పాల్గొన్నారు



## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే సండ్ర సంఘీభావం

**టి మీడియా, ఏప్రిల్ 23,సత్తుపల్లి:** సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య సంఘీభావం తెలిపారు. సమ్మె ప్రదేశాన్ని సందర్శించిన ఆయన కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు చేస్తున్న డిమాండ్లు న్యాయసమ్మతమైనవేనని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. అలాగే ప్రైవేట్ డ్రైవర్లతో బస్సులు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లో జరిగే అనర్థాలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, జేఏసీ నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు

## విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

ద్వారా వివిధ నైపుణ్యాలపై శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎలక్ట్రీషియన్, మెకానిక్ వంటి రంగాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్నామని చెప్పారు. ఈ శిక్షణల ద్వారా వారు స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.వైద్య రంగంలో కూడా పేదవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. పేదల పక్షపాతిగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని వివరించారు.ప్రభుత్వం మీ కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో శాతం వంద ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్ మరియు సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వ తరపున హృదయపూర్వకంగా అభినందించారు. ఇదే విధంగా భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ , ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తోందన్నారు. పినపాక నియోజకవర్గంలో కూడా ఈ పాఠశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకటరావు మాట్లాడుతూ , ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ డైట్ ఛార్జీలు పెంచి పోషకాహారం అందిస్తున్నదన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించబడుతున్నాయని, ఈ అవకాశాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, “ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యాచరణ”లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ మాట్లాడుతూ, ఈ విద్యాసంస్థలో ప్రస్తుతం 584 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. 16 గదులతో నిర్మించిన కొత్త డార్మెటరీ ద్వారా సుమారు 600 మందికి వసతి కల్పించగల సామర్థ్యం ఏర్పడిందన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉందని, ఐఐటీ తదితర ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గిరిజన గురుకుల విద్యాసంస్థల అభివృద్ధికి ప్రభుత్వం రూ.53 కోట్లు మంజూరు చేయగా, భద్రాచలం ఐటీడీఏకు రూ.6 కోట్లు, ఈ పాఠశాలకు రూ.25 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. గిరిజన పాఠశాలల్లో కూడా డిజిటల్ తరగతులు నిర్వహించేలా తగిన సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి ని కోరారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ పూనెం రమేష్,పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## దశదినలో మంత్రి పొంగులేటి నివాళి

**టీ మీడియా,ఏప్రిల్ 23 ,కొణిజర్ల :**లాలాపురం గ్రామంలో నామ శ్రీను దశదిన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు తుమ్మల యుగంధర్ కూడా హాజరై కుటుంబ సభ్యులకు పరామర్శలు తెలిపారు. గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీను సేవలను స్మరించుకున్నారు.మార్క్‌ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూతకాని జైపాల్, రాయల పుల్లయ్య, చింతనిప్పు చలపతి రావు, గోరింట్ల పిచ్చారావు, జాలాది రామకృష్ణ, అయిలూరి మోహనరెడ్డి, పాసంగులపాటి రవి, చింతనిప్పు ప్రసాద్, షేక్ కాశీం, తేళ్లూరి వీరయ్య, మోదుగు వెంకటి తదితరులు పాల్గొని శ్రీను కుటుంబానికి తమ సానుభూతిని తెలిపారు.

## కారేపల్లి పోస్టు ఆఫీస్‌లో చోరీకి యత్నం



**టీ మీడియా,ఏప్రిల్23,సింగరేణి(కారేపల్లి):** కారేపల్లి పోస్టు ఆఫీస్‌లో బుధవారం రాత్రి దొంగలు చోరికి యత్నించారు.కారేపల్లి శివాలయం వీధిలో ఉన్న పోస్టు ఆఫీస్ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు పోస్టు ఆఫీస్‌లోని క్యాష్ చెస్ట్(లాకర్)ను ఓపెన్ చేయటానికి ప్రయత్నం చేశారు.అది విఫలమైంది, కార్యాలయంలోని బీరువాలను తెరిచి నగదు కోసం వెతికిన ఆనవాళ్లు కనిపించాయి. ఉదయం పోస్టుఆఫీస్‌కు వచ్చిన సిబ్బందికి కార్యాలయ ముందు తలుపుకు ఉన్న తాళ్ల పగులగొట్టి ఉండటం చూసి సబ్ పోస్టు మాస్టర్ కే.ప్రశాంత్‌కు విషయం తెల్పి పోలీసులకు కబురు చేశారు.క్యాష్ చెస్ట్‌లో రూ.40వేలు ఉన్నాయని, వాటికి ఎలాంటి నష్టం జరగలేదని ఎస్‌పీఎం ప్రశాంత్ తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. దీనికి సంబంధించి సబ్ పోస్ట్‌మాస్టర్ ప్రశాంత్ కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.

## ఐటీసీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

సంఘం నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. త్వరితగతిన కార్మికులకు రూ.22 వేల వేతన ప్యాకేజీ, వందశాతం అన్లిమిటెడ్ మెడికల్, బదిలీలందరినీ రెగ్యులర్ చేయడంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు ఆమోదయోగ్యమైన వేతన సదుపాయం కల్పించాలని తదితర అంశాలపై కార్మికులు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.గుర్తింపు సంఘంతో పాటు ఐటీసీ యాజమాన్యం కార్మికులకు మంచి వేతన ఒప్పందం చేయకపోతే కార్మిక జేఏసీ మున్ముందు తీసుకునే నిర్ణయాలకు యాజమాన్యం, గుర్తింపు సంఘాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాబోయే కాలంలో కార్మిక జేఏసీ సమస్యల పరిష్కారం కోసం పోరాటం మరింత ఉధృతం చేస్తుందని, ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించి వేతన ఒప్పందంలో మెరుగైన ప్యాకేజీ తీసుకురావాలని, లేనిపక్షంలో జేఏసీతో కలిసివస్తే మంచి వేతన ఒప్పందం చేయడానికి సహకారం అందిస్తామన్నారు. ఈ మౌన ప్రదర్శనకు పెద్ద సంఖ్యలో కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.